# జ్ఞానోదయం

సోమంచి రామం



రాఘవయ్యగారు యింటిముందు వేసిన ఆకాశమంత పందిరి క్రింద కూతురిపెళ్ళి చేస్తున్నాడు. అంతా సందడిగా ఉంది. ఆడా, మగా అంతా బిలబిలమంటూ పందిరంతా నిండిపోయారు. అవునుమరి !...ఒక్కగాని ఒక్క కూతురికి పెళ్ళి చేస్తున్నాడంటే మరి యెక్కడెక్కడి చుట్టాలు పక్కాలు రారుమరి !- అందులోనూ కాస్తో కూస్తో హోదాలోవున్న అధికారి !...ఇక వేరే చెప్పాలా !- పైగా ఉదయం ముహూర్తము...అంతా మెలకువగానే ఉంటారుగా !... ఓ పక్క సన్నాయిమేళం- యింకో ప్రక్క పసిపిల్లల ఏడుపులు. పిల్లల అల్లరి ఈ గొడవలతో నిమిత్తం లేదన్నట్లు- పురోహితుడుమాత్రం తన డ్యూటీ యథావిధిగా కానిచ్చేస్తున్నాడు...

"అమ్మా !-పెళ్ళికూతుర్ని తీసికొని రావాలి ... ముహూర్తం దగ్గరపడుతోంది..."అంటూ ఓ కేకేసి మంత్రాలు ప్రారంభించేశాడు. 'భజంత్రీలు... అవందోయ్ ! ఒక్కసారి..." అన్నాడు పురోహితుడుగారు... తనకేమీ మంత్రాలు రావనుకుంటున్నారేమోనని- గట్టిగా వల్లిస్తూ !

ఇంతలో పెళ్ళికూతుర్ని తీసుకొచ్చారు... మేళతాళాలు మ్రోగించారు... పురోహితుడు తతంగం పూర్తిచేయిస్తున్నాడు... అక్షింతలు అందరికీ పంచి పెట్టి వచ్చాడు...

"లే ... నాయనా !... లే !... ఆ మూడు ముళ్ళు వెయ్యి..." అంటూ పెళ్ళికొడుకు చేత మంగళసూత్రం కట్టించేశారు.

-అంతా లేచి వధూవరుల నాశీర్వదించి అక్షింతలు వేశారు.

'ఇకమాకు సెలవిప్పించండి రాఘవయ్యగారూ! మళ్ళీ ఆఫీసుకి టైమవుతుంది." అన్నారు వచ్చిన కొందరు ఉద్యోగులు.

'అదేం కుదరదు. భోజనాలుచేసి..." అంటున్నాడు రాఘవయ్య

'రాత్రి డిన్నర్ కొస్తాంగా !' అన్నారు వాళ్ళంతా !

సరే ... ఈ పూటకూడా వుంటే నాకానందం" అన్నాడు.

మొత్తానికి అమ్మాయిపెళ్ళి అయిందనిపించేశాడు రాఘవయ్యగారు... ఆ సాయంత్రం అయిదున్నర గంటలకు ఓ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. డాన్సు ప్రోగ్రాం...రాజమండ్రినుంచి ప్రత్యేకంగా పిలిపించారు. డాన్సుచేసే అమ్మాయిలను... వారింతా కలిసి ఓ అరడజనుమంది ఉన్నారు. పెళ్ళిరోజు ఉదయాన్నే వచ్చారు ... వాళ్ళకు ప్రత్యేకం ఓ ఇల్లు ఖాళీ చేయించాడు రాఘవయ్యగారు...ఆసాయంత్రం వాళ్ళుతెల్లని మల్లెపువ్వుల్లాటి చీరెలు కట్టుకుని. తల్లో మల్లెపూలు నిండుగా పెట్టుకుని సినీమా తారల్లా అలంకరించుకుని పందిట్లో అడుగుపెట్టేసరికి అందరి ఒళ్ళు ఒక్కసారి ఝల్లుమన్నాయి ..పందిట్లో ఉన్న మగాళ్ళల్లో పెళ్ళయిన వాళ్ళు - పెళ్ళాల కంటబడకుండా దొంగచూపులు చూడసాగారు...పెళ్ళికాని బ్రహ్మచారులు పట్టిగానే చూస్తూ పోజులు కొట్టున్నారు...కొంచెం వయసు మళ్ళినవారు మళ్ళీ మనకు వయసొస్తే బాగుండు ననుకున్నారు. మధ్యలో - చిన్న పిల్లలు ముందు ముందుకి జరిగి కూర్చుంటున్నారు. వాళ్ళ కాళ్ళకు కట్టిన గజ్జెలకేసి చూస్తూ !...ఇక ఆడవాళ్ళ సంగతి చూస్తే వార్ధక్యం దగ్గరపడుతున్న వాళ్ళు— 'ఇదేం వేషమమ్మా - రోత ..' అనుకుంటూ విసుక్కుంటున్నారు... ఇక ఒళ్ళో పిల్లలు పాలకేడిపిస్తుంటే— "ఛీ-పాడు పిల్ల-ఎప్పుడూ పీకుడే -" అంటూ కసురుకుని రవిక ముడి విప్పి పిల్లకు రొమ్ము అందించి చెంగు కప్పుకుని యీ సందట్లో మొగుళ్ళు ఎటుచూస్తున్నారో అని వాళ్ళకోసం వెతుకుతున్నారు. పిల్లల తల్లులు. పెళ్ళికావడానికి సిద్ధంగాఉన్న ఆడపిల్లలు. ఆ డాన్సర్ల డ్రస్సుకేసి. హెయిర్ స్టయిల్ కేసి లిప్‌స్టిక్ కేసి. డాన్స్ టెక్నిక్ కేసి చూస్తూ-తమకూ అలాంటివి ఉంటే— అంత అందంగా ఉండకపోతామా అని తమలో తామే తమ అందాన్ని చూసుకుంటున్నారు. తిన్నగా పందిరి మధ్యలో వేసిన పెద్ద సోఫాలో పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ వచ్చి కూర్చున్నారు. క్షణంలో మద్దెల మ్రోగింది...ఫిడేలు సన్నగా గొంతు విప్పుకుంది...అంతలో కళ్ళు జిగేలుమనేట్లుగా అడుగులలో ఒక అమ్మాయి ఛెంగున గెంతింది ముందుకి . డాన్సు ప్రారంభించింది ... నాయకురాలు పాట ప్రారంభించింది...పాటకుతగ్గ నాట్యం సాగుతోంది...

"సరసుడ దరిచేరర...సరగున నాసరసకు .
రారా ."

॥స॥

నయమున నను పాలింప...వినయమున
నే లాలింప...

సమయమిదేరా ... రారా ... సరసుడ దరి
చేరరా..."

నృత్యం జోరుగా సాగుతోంది.. పెళ్ళికుమారుడు ఉత్సాహంగానే చూస్తున్నాడు .ఇంతలో లేడిపిల్లలా ముందుకు దూకింది యింకో అమ్మాయి..

వగవగల వగలాడిని కానురా...
జాగుసేయనే వేగలేనురా...
నీ బిగి కౌగిట నను చేర్చరా...రా...న

అంటూ నృత్యం చేసింది.

పెళ్ళికొడుకు ప్రసాద్ కళ్ళన్నీ యింకో అమ్మాయిమీదే ఉన్నాయి ..ఈ చిత్తరకం అతని కేం నచ్చలేదు...అందుకే గాబోలు - ప్రక్కనే మిత్రుడు మధుని పలకరిస్తున్నాడు నెమ్మదిగా !

'ఏరా !...మధూ ...ఏమిటిదోయ్ ?...'

'ఏం బ్రదర్ ...బాగాలేదా ?...ఎవర్ని అడమంటావో చెప్పు ..'

అటునుంచి రెండోది..."

క్షణంలో బాణంలా దూసుకుపోయాడు మధు. నాయకురాలి దగర కెళ్ళాడు...ఆమె తల ప్రక్కగా పెట్టింది...ఆమె చెవిలో యేదో చెప్పాడు. ఇదంతా గమనిస్తూనే వుంది రాధారాణి - ప్రసాదు కోరిన రెండోది...అసలు ఆమెకు యీ పందిట్లోకి వచ్చాక యెలాగో అనిపించింది ..యిక్కడ నాట్యం చేయాలనిపించడంలేదు యెందుకనో-అయినా తప్పదు ..

'వన్నెకాడ నీకిది న్యాయమా ?...
నన్నిట కోరనీక తగునా ?... వన్నె
పై పై మెరుగులకు భ్రమపడి
పసిడిమేల్ బంగరు బొమ్మను నీడి
అందనిదానికై ఆశపడ తగునా , వన్నె!

-అంటూ భావ యుక్తంగా పాడేసి నాట్యం పూర్తి చేసింది...

నాట్యం ఆఖరి స్థాయిలో ఉండగా రాధారాణి ఒళ్లు తెలియని ఆవేశంతో నృత్యం చేసేసింది... దాంతో వృత్తిహతప్పి పడిపోయింది. అంతా ఖంగారు పడ్డారు అప్పాటి కార్యక్రమం అలా ఆగిపోయింది ఆ మర్నాడు మధుచేత పదిసార్లు కబురుచేసి కనుక్కున్నాడు రాధారాణిగురించి ప్రసాదు. మిత్రుని మాట తీసేయలేక ప్రతిసారి రాధారాణి దగ్గర కెళ్ళి కనుక్కొస్తూనే ఉన్నాడు మధు...

ఆ రాత్రే ప్రసాదు శోభనం. అయినా ప్రసాదు మనస్సు రాధారాణిపై లగ్నమైపోయింది. యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం నశించిపోయింది. మిత్రుడు మధుని ఉపయోగించుకున్నాడు. ఎంత బ్రతిమాలినా వినని ప్రసాదు మంకుపట్టుని వినిగిపోయి మధు రాధారాణి దగ్గరకు పోయి విషయం చెప్పాడు ... రాధారాణిని ఓ ప్రత్యేకమైన గదిలో పడుకోబెట్టింది నాయకురాలు యీ సంతోషవార్త విని...రాధారాణి అవునన లేదు...కాదన లేదు.

'అమ్మా ! మీరంతా ప్రక్కకు తప్పుకోండి ! అమ్మాయిని గదిలోకి పంపండమ్మా ! పొద్దుపోదం పెట్టమ్మా...'అంటూ ఓ ముత్తైదువ పెళ్ళికూతురు కమలను గదిలోకి నెట్టి బయట గొళ్ళెం పెట్టింది అమ్మలక్కలంతా ఎకసెకలు - వికవికలు - పోగింకాను. ఏవేవో మధుర స్మృతులను గుర్తుతెచ్చుకుని నవ్వుకున్నారు ముసిముసిగా అ పట్టు గడిచిపోయినవాళ్ళు ! పెళ్ళికాని పిల్లలు లోపల ఏం జరుగుతుందోనని ఊహిస్తూ నిద్రలోకిదిగిపోయారు

'రా ! ..యిలారా ! .. ఎంతసేపలా నిల్చుంటావు ! .. ఏదీ ?... యిలా చూడు .. యింకా సిగ్గెందుకు ?...' అన్నాడు ప్రసాద్ మెల్లిగానే !

ఇంతలో మళ్ళీ బయట అమ్మలక్కల నవ్వులు వినిపించాయి.

"ఓహో ! అదా సంగతి ! వాళ్ళింకా పోలేదనా ! ఎప్పుడూ యిది మామూలేగా ! బయటనవ్వే వాళ్ళలో ఎంతమంది యిలాంటి ఘట్టాన్ని తమ జీవితాల్లో గడపలేదూ ! ఎంతమంది యికముందు గడపబోరూ ! అయినా అది వాళ్ళ ఆనందం ... ఈరాత్రి మన ఆనందం. చూశావా అంతా వెళ్ళిపోయారు. 'రా ! ఏం? మాటలురావా? లేకమాట్లడితేనే నీ నోటి ముత్యాలు రాలిపోతాయా ?' అంటూ మంచం దిగి కమలదగ్గర కొచ్చి దగ్గరగా తీసికొన్నాడు ప్రసాదు ... ఓ చేత్తో తలుపు గడియవేస్తూ ! కమల సిగ్గుతోను, ఆనందంతోను ఉక్కిరిబిక్కిరయిపోయి అతనిలో ఒదిగిపోయింది. మంచం దగరకు నడిచారు యిద్దరు ఒక్కటే ఆప్యాయంగా !

'పాలు తాగుతావా ? ." అన్నాడు ప్రసాదు.

"ఆ మాట నేనడగాలి మిమ్మల్ని ..'

'అబ్బా ఇప్పటికి చిన్నారిగారి సిగ్గు వదలి చిలుక పలుకులు బయట కొస్తున్నాయే ..."

"ముందు కాసిని పాలు త్రాగండి..." అంటూ పాలగ్లాసు నోటి కందించింది. ప్రసాదు సగం త్రాగి తక్కినవి కమలచేత త్రాగించాడు.

'అబ్బ ఉక్కగా ఉందే !' అన్నాడు.

'అలా పడుకోండి ! విసురుతాను' అంటూ

---

## అభివృద్ధి

పాతసమస్యలకు కొత్త సమస్యలను చేర్చుకుంటూ పోవడం ..

---

విసరడం మొదలుపెట్టింది.

'కమలా ! పడుకోవాలనే ఉంది...కాని..."

"ఏమిటండీ?" అంది.

"ఏం లేదు. ఈ రాత్రి నా స్నేహితుడికి చాల జబ్బుగా ఉందని తెలిసింది. ఈ ఊళ్ళోనే ఉంటున్నాడు. వెళ్ళి చూసిరావాలి యిప్పుడు..."

ఇప్పుడా ఇంత అర్ధరాత్రి. అందులోనూ యివాళ..."—సిగ్గుతో ఆగిపోయింది కమల !

"అలా అనకు కమలా .. తెల్లారితే మరి ఉంటాడో ఉండడో ! ఈ ఒక్కరాత్రి ఓడదు కున్నావంటే యిక ఏపటిమంచీ హాయిగా..."

"నన్నిలా వెయ్యటం మీకు న్యాయమేనా ?" అంటూ ఏడుపు ప్రారంభించింది కమల !

'ఛా ! ఛా ! యీ మాత్రానికే ఏడుపయితే యెలాగ ? వెళ్ళి చూసి తెల్లారేలోగా వచ్చేస్తాగా ! నా మాట నమ్ము '

'నమ్మక చేసేదేముంది?..."

"అదిగో-నమ్మడం లేదన్నమాట ... అయితే వెళ్ళను లే ... చిన్నప్పటినుంచి నన్ను కన్న తండ్రిలా పెంచుకున్న నా మిత్రుడు చావుబ్రతుకులలో ఉంటే చూడకుండ-నేను స్వార్థంతో స్వంత సౌఖ్యాన్ని చూసుకున్నానని తెలిస్తే-వాడు నిజంగా చచ్చిపోతాడు.'

"వద్దు ..వద్దు వెళ్ళండి' అంది కమల ... భారత స్త్రీ కదూ !

'అదీ అలా ఉండాలి ఏదీ ... కన్నీరు తుడుచుకో ఆ ఒక్క చిరునవ్వు నవ్వు" అంటూ ఒక్క ముద్దుపెట్టుకుని యింకో ద్వారం గుండా బయటికెళ్ళిపోయాడు రెండో కంటివాడికి తెలియకుండా.

* * *

'రండి మీకోసమే చూస్తున్నాం పస్తారని." అంటూ గుమ్మంలోనే ఆహ్వానాన్నందించింది నాయకురాలు ప్రసాదుకు ... ఆ సమయంలో వాళ్ళందరూ మెలకువగా ఉన్నారేమోనని కొంచెం భయమేసింది! ... గుండెల్లో పుట్టిన గుబులుకు ఒళ్ళంతా ఆయాసపడింది.

'నిలబడే ఉన్నారేం! అంతా పడుకున్నారు ! అదిగో ఆ గదే మీరు కోరుకొన్నది " అంటూ రాధారాణి ఉన్నగదిని చూపించింది

ప్రసాదు నెమ్మదిగ తలుపుకొట్టాడు...తలుపు దగ్గరగానే వేసిఉంది.

'తలుపు తీసే ఉంది వెళ్ళండి..." అంటూ నాయకురాలు ప్రోత్సాహాన్నిచ్చి పంపించేసింది.

"ఆ మీరా.. " అంది రాధారాణి ప్రసాదును చూసి.

'అవును ... నేనే రాధా' అంటూ ముందు కెళ్ళాడు.

'ఎందుకిలా వచ్చారు? అర్ధరాత్రి ... అందులోనూ యివాళ మీ శోభనం' అంది.

"అవును రాధా శోభనమే! అక్కడ కాదు... యీ స్వర్గధామంలో యిక్కడ ... రా' అంటూ మత్తెక్కిన కళ్ళతో కామ తమకంతో రాధారాణి దగర కెళ్ళాడు...

'ఆగండి ... ఏమిటా తొందర?.. ఏమిటీ గుడ్డిమోహం ? ... మిమ్మల్ని నమ్ముకున్న ఆ అమ్మాయికి యిలా ద్రోహం చేస్తారా?"

'ఆగలేను రాధా ..దీన్ని మోహమే అను... వ్యామోహమే అను. అంతకన్నా ద్రోహమేఅను. ఏమన్నాసరే!...నిన్ను చూసిన మరుక్షణంనుంచే నా మనసు నిలవడంలేదు...రా...యీ రాత్రి వృధా పోనీయకు..." అంటూ చెయ్యిపుచ్చుకున్నాడు.

ఛీ ...కామాంధుడా ... కామాంధకారంలో నీ కళ్ళు మూతలు పడిపోతున్నాయి ... అందుకే యిలాంటి తప్పుడు త్రోవన పడ్డావు ... దూరంగా వుండు. దగ్గరకు రాకు..." అంటూ ప్రక్కకు జరిగింది...

"రాధా!...ఏదో అంధకారం ... ఏదైతేనేం? నీకోసం వచ్చేశాను... యిదిగో నీకోసం తెచ్చాను సొమ్ము ... వెయ్యి రూపాయలు...." అంటూ జేబులో సొమ్ముతీసి చూపించాడు

'దుర్మారుడా ...అన్నెం పున్నెం తెలియని ఆ అమ్మాయికి ద్రోహం చేస్తావా?" అంటోంది రాధ.

"రాధా ...యిక నన్ను బాధించకు ! ... నీ సుందర రూపాన్ని చూడగానే—"

"ఏమిటీ? ..నా సుందర రూపాన్నా?..."

"అవును...నీ దివ్యసుందర విగ్రహాన్ని..."

"అయితే అంతా సరిగా చూశావా?"

"ఆ ...అందాలు విరజిమ్ముతున్న నీముఖం"

"అవును...అంతవరకే నీకు కనిపించింది... దాన్ని చూసే నీవు పరుగెత్తుకొచ్చావు. యిదిగో... యిలా చూడు . యివేమిటి?"

'ఆ...ఆ...ఏమిటీ దద్దుర్లు? ఏమిటీ పుళ్ళు?. వళ్ళంతా ఉన్నాయే?..."

'ఆగు!...ఖంగారు పడకు...యిటు ప్రక్క చూడు .."

"అమ్మో!...ఒళ్ళంతా—"

"అర్థమవుతోందా?...వ్యాధిగ్రస్థం కాబోతున్న నా దేహం. చూశావా ? యిలాగే ఉంటాయి మా దేహాలు...జీవితాలు".

'చాలు రాధా! చాలు. అసలు రహస్యం తెలియక—"

"పిచ్చివాడా! యిప్పటికైనా తెల్సిందా ... యిలాటి శరీరాలకే పౌడర్లు, స్నోలు. రంగులు పూసి. సిల్కుచీరలుకట్టి, సెంట్లురాసి దేవతాస్త్రీల్లా మీ కళ్ళకు కనబడి మిమ్మల్ని మత్తెక్కిస్తాము."

"రాధా! నువ్వు దేవతవు. నాకు సరియైన త్రోవ చూపిస్తున్నావు."

'అవును. పాపం ఆ అమ్మాయి యెంత బాధ పడుతోందో! తన భావిజీవితానికి ప్రథమ సోపానమైన యీ రాత్రి ఎంతో ఆనందంగా అనుభవిద్దామని ఆశతోవచ్చి నిరాశతో నిద్రించి ఉంటుంది. లే ...వెళ్ళు ...యిక ఆమెను ఓదార్చి దగ్గరకు తీసుకో."

"వెడతాను. రాధా! వెడతాను. నా కళ్ళు తెరిపించావు. కాని నా కొక్క సందేహం... వేశ్యవైయుండి డబ్బుతో వచ్చిన నన్ను తిరస్కరించావు. అందర్నీ ఇంతేనా ?"

"నాకు తెలిసినంతవరకు పెళ్ళయిన ఏ యువకుడ్ని దగ్గరకు రానీయలేదు. అయినా ఆ అమ్మాయిని చూస్తుంటే."

'ఆ. కమలను చూస్తుంటే. నీ కింత అభిమానం కలిగిందా ?... ఏం ?"

"అబ్బే. ఏంలేదు... ఏంలేదు! .. సాటి స్త్రీ జీవితం నా మూలాన నాశనం కావడం నా కిష్టం లేదు."

"అలాక్కాదు ఏదోవుంది. నా దగ్గర దాచకు! నాకు జ్ఞానోదయం కలిగించిన మాతృమూర్తి... నీ మనసులోవిది విజంగా చెప్పు."

"ఏం చెప్పను ?"

"కమలంటేనే నీకేదో అభిమానం ఉండాలి. లేకపోతే నన్ను యిలా."

"అవును. నిజమే! కమల...నా చెల్లెలు!!"అంది గంభీరంగా ఏం పరిణామం ఎదురవుతుందోనని భయపెడ్తూ!

"ఏమన్నావ్ ?... నీ చెల్లెలా ?" అంటూ కోపంగ చెంపమీద కొట్టాడు ప్రసాద్!

అంత దెబ్బతగిలినా రాధారాణి ఆవేశం చెందలేదు.

'మరేం పర్వాలేదు ... ఎన్ని చెంపదెబ్బలు తిన్నానో యీ జీవితంలో.ముద్దుకోసం కొట్టారు కొందరు...కోపంతో కొట్టారు కొందరు .లాలిస్తూ కొట్టారు కొందరు...కొడుకులాటివాడివని కొట్టావు సంతోషం...కాని ఒక్క ప్రశ్న అడగనా ?..."

"ఏమిటది ?"

"తొలిరోజునే ఆమె జీవితాన్కి ద్రోహంచేసి నువ్వు వేశ్యా గృహానికి వచ్చావే !.అలాంటి నీకు నీ భార్య వేశ్య చెల్లెలంటే అంత కోపమా?... నువ్వు వ్యభిచారుడవైతే తప్పులేదూ కమల నా చెల్లెలంటే నీకు తప్పయిందా ? విను మళ్ళా చెప్తున్నాను. కమల...నా చెల్లెలే !..."

"నాకు మతిపోతోంది రాధారాణీ ...అసలు విషయం చెప్పు !...

'విను...జాగ్రత్తగా...విను..."

"చెప్పు .."

"పదహారేళ్ళ క్రితం కాబోలు...తల్లి తండ్రులను పోగొట్టుకొన్న మేము.పిన్నితో సహా కోటప్ప తిరనాళ్ళ కెళ్ళాము .. ఆ కోలాహలంలో మారిపోయాం ...పిడ విరగడయిందనుకుంది పిన్ని! నేను వీళ్ళకు దొరికాను...సహవాస దోషంవల్ల - పూర్వజన్మ పాపం వల్లా యిలాటి బ్రతుకులోకి దిగాను...కమల అదృష్టవశాత్తు - ఆయన చేతికి దొరికింది. అందుకే చక్కగా అలా పెరిగింది... పెళ్ళిలోనే గుర్తుపట్టాను. ఇదిగో దాని చిన్నప్పటి ఫొటో...మిలమిలలాడే కళ్ళు . తిన్నని సన్నని ముక్కు..ముక్కు చివర చిన్న కాయ. యీ రహస్యాన్ని బయటపెట్టి దాని జీవితాన్ని పాడుచేయడం నాకిష్టంలేదు..కాని .నువ్వు బలవంతం చేశావని చెప్పాను..తెల్సిందా !...లే ...వెళ్ళు...పాపం.. కమల..నీకోసం ఎదురు చూస్తూ ఉంటుంది .మళ్ళీ సూర్యోదయం కాకుండా వెళ్ళిపో' అంది.

"వెడతాను. వేశ్యామోహంలో పడ్డ నాకు జ్ఞానోదయం కలిగించావు. కృతజ్ఞుడి . ఈసొమ్ము తీసుకొని నీ ఒళ్ళు బాగుచేసుకో..."

"ఒళ్ళు బాగు చేయించుకోనా? ఎందుకు! యింకా వందల కొద్దీ అమాయిక జీవితాల్ని నాశనం చేయడానికా? చాలు యిప్పటికి చేసిన పాపం చాలు! ఈ కథ యిప్పటితో మర్చిపో" అంటూ నెమ్మదిగా తలుపుతీసి పంపించేసింది ప్రసాదును.

• • •

"కమలా !...కమలా !" ... మెల్లిగా తలుపు కొట్టాడు ప్రసాదు.

'ఆ! మీరా! ... వచ్చేశారా ?. " అంటూ ఉలిక్కిపడి తలుపుతీసింది నెమ్మదిగా!

'నేనే !...కమలా ! . నేనే !"

'ఎలా ఉంది మీ మిత్రుని జబ్బు!..."

'నన్ను క్షమించు కమలా! నీకు ద్రోహం తలపెట్టాను.' - అంటూ దగ్గరకు తీసికొన్నాడు.

'అవేం మాటలండీ! ... బాగా అలిసిపోయి వట్టున్నారు. కొంచెం పాలు .." అనబోయింది కమల! ..

ఇక ఆ పైమాటల్ని రానియ్యలేదు ప్రసాదు రెండు పెదాలు! —

★

